# ఆర్ డి టి

## ఎకాలజీ సెంటర్, అనంతపురం.

**ఈ మాసపు సమాచారం** మే, 2008

FOR PRIVATE CIRCULATION ONLY


## మీకు తెలుసా !

- ప్రపంచంలో ప్రతి సంవత్సరం 60 శాతం సముద్రాలు ఒక మీటరు వైశాల్యం మేరకు కుదించుకుపోతున్నాయి.
- పరిశ్రమలు ఇతర మాధ్యమాలవల్ల ప్రతి సంవత్సరం 21 బ్యారెళ్ళు (సుమారు 246430 లీటర్లు) ఆయిల్ సముద్రంలో కలుస్తున్నది.
- ప్రతిదినం 11650 టన్నుల వ్యర్థాలు సముద్రాల్లోకి వదిలి వేస్తున్నారు. సముద్రంలో వదలబడే ప్లాస్టిక్ ఇతర వ్యర్థాల వల్ల ప్రతి ఏటా లెక్కలేనన్ని చేపలు ఇతర జీవులు చనిపోతున్నాయి.
- ప్రపంచంలో మొత్తం నీరు 70 శాతం భూభాగాన్ని ఆవరించి వుంటుంది.
- 97.50 శాతం నీరు సముద్రాల్లో ఉంది. 2.5 శాతం నీరు చెరువులు, సరస్సులలో ఉంది.
- 5 శాతం నీరు మాత్రమే ఉపయోగించడానికి అవకాశం ఉంది.
- 40 శాతం నీటి వసతి మాత్రమే ఉన్నటువంటి ప్రదేశాలలో జనాభా కాపురముంటున్నారు.
- మన దేశంలో లభ్యమయ్యే నీటిలో 38.5 శాతం వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారు.
- 4 శాతం నీరు మాత్రమే పరిశుభ్రమైన నీరుగా ప్రజలకు అందుబాటులో ఉంది.
- 2015 నాటికి 634 బిలియన్ క్యూబిక్ నీటికై డిమాండ్ ఉంటుంది. కానీ కేవలం 1123 బిలియన్ క్యూబిక్ నీరు మాత్రమే అందుబాటులో ఉంటుందని అంచనా.
- 80 శాతం నీటి కాలుష్యానికి మనుష్యులే కారణం. ఇండియాలో మూడు దశాబ్దాల కింద సముద్రతీర పట్టణాల సంఖ్య 59 మాత్రమే. అది 121కి పెరిగింది. ఈ పట్టణాల ద్వారా వెలువడే వ్యర్థాలు రోజూ 8914 టన్నులు సముద్రంలో కలుస్తున్నాయి.
- ప్రపంచవెుత్తంగా 10 నదులు అధికంగా కలుషితమౌతున్నాయని గుర్తించిన వాటిలో మన దేశంలో గంగ, సింధు నదులున్నాయి.
- దేశంలోని 17 రాష్ట్రాలలోని 6 కోట్ల 20 లక్షల ప్రజలు ఫ్లోరైడ్ వ్యాధిచే ప్రభావితమై ఉన్నారు. ఇందులో 60 లక్షల పిల్లలున్నారు. దేశంలోని 8700 గ్రామాల్లోని 2.5 కోట్ల ప్రజలు ఫ్లోరిన్‌తో బాధపడుతున్నారు.

**చిట్కా :** వాము, మిరియాలు, ఉప్పు వేయించి దంచి పొడిచేసుకుని రోజూ సేవిస్తే గ్యాస్ ట్రబుల్ తగ్గుతుంది.

## నిరుపేదలకు వరం రెండు రూపాయలకు కేజి బియ్యం

ఏప్రిల్ మాసం నుంచి రాష్ట్ర ప్రభుత్వం రెండు రూపాయలకు కేజి బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో తెల్లకార్డులవారికి ఇచ్చే బియ్యం ధర 5-18 పైసలు ఉండేది. పేదలకు ఇస్తున్నటువంటి బియ్యం కోటాలో మార్పులు చేర్పులు లేవు కానీ బియ్యం రేటు మాత్రం రెండు రూపాయలకే దించడం చాలా శుభ పరిణామం. పేదలు, కొనుగోలు స్థోమతలేనివారు నివసించేది ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలోనే కాబట్టి గ్రామీణ ప్రాంతాలలో ఆహార భద్రత కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. మన జిల్లాలో 85 శాతం కుటుంబాలకు తెల్లకార్డులున్నాయి. కాబట్టి ఈ పథకం ద్వారా కేవలం నిరుపేదలే కాకుండా, మధ్య తరగతి రైతులు కూడా లబ్ధిపొందే అవకాశం వున్నది. రెండు రూపాయలకు కేజీ బియ్యం ఇవ్వడంతోనే గ్రామీణ ప్రాంతాలలో పేదరికం, దారిద్ర్యం తొలగిపోయి ప్రజల జీవితాల్లో వెన్నెల కాస్తుందని ఊహించలేం, కానీ ప్రజలలో ఆహార భద్రత కల్పించడానికి, నిరుపేదలకు బాసటగా తీసుకునే ఏలాంటి చర్య అయినా మనం ఆహ్వానించాలి ఆ రకంగా మొదటగా స్వాగతిద్దాం. ఇప్పటికే మన జిల్లాలో వ్యవసాయ కూలీలకు బాసటగా ఉపాధి హామీపథకం ఉంది. దీని ద్వారా గ్రామాలు వదిలి వలసదారి పట్టకుండా స్వంత గ్రామాల్లోనే ఉపాధి దొరికే అవకాశం అందుబాటులో ఉంది. ప్రతి పథకం అమలులోనూ అనేక సమస్యలుంటాయి. అలాగే బియ్యం పథకంలోనూ సమస్యలుంటాయి. వాటిని అధిగమించి మనకు ఉపయోగకరంగా మార్చుకోవడంలోనే మన చైతన్యం ఇమిడి ఉంటుంది.

మన జిల్లాలో ప్రస్తుతమున్న తెల్లకార్డుల ప్రకారం ప్రతి నెల 14085 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ అవుతున్నది. ఇవి కాకుండా అంత్యోదయ పథకానికి 2588 మెట్రిక్ టన్నులు, అన్నపూర్ణ పథకం కింద 18 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయబడుతోంది. ఏదైనా మాట్లాడే ముందు మన జిల్లా పరిస్థితిని గూర్చి ముందుగా జ్ఞాపకం చేసుకోవాలి. తక్కువ ప్రకృతి వనరులతో ప్రతి చదరపు కిలోమీటరుకు 191 మంది అతి తక్కువ జనసాంద్రత కలిగిన జిల్లా మనది. జీవన వనరులు ఎక్కువ దొరికే చోట జన సాంద్రత కూడా ఎక్కువగా ఉంటుందనే విషయం మనం గుర్తుంచుకోవాలి. ఉభయ గోదావరి జిల్లాల్లో ఒక చదరపు కి.మీ. జన సాంద్రత 454-494గా ఉంది. ఇతరత్రా ఏ రకమైన జీవనాధారాలు లేని పరిస్థితులలో వృద్ధులకు ఉచితంగా బియ్యం ఇవ్వడం పథకం దగ్గర్నుంచి తెల్లకార్డులకు రెండు రూపాయల వంతున బియ్యం ఇవ్వడం వరకూ నిరుపేదలకు ఆధరువంటిదనే విషయం కూడా మనం మర్చిపోరాదు. ఈ రాష్ట్రంలో స్వర్గీయ ఎన్.టి.రామారావు 1983లో ఏప్రిల్ మాసంలోనే రెండు రూపాయలకు కేజీ బియ్యం ప్రకటించడం చారిత్రాత్మకమైనది. అప్పటి నుండి రేట్లు మారుకుంటూ వచ్చి 5.18 అయింది. ఆనాడు రాష్ట్రం మొత్తం మీద రెండు రూపాయలకు కేజీ బియ్యం ప్రకటించినప్పుడు 78.69 కోట్లు ప్రభుత్వం మీద సబ్సిడీ భారం ఉండింది. ఈ రోజు 1980 కోట్లు సబ్సిడీ భారం పడబోతున్నది. ఆనాడు బహిరంగ మార్కెటు ధర 8-9 రూపాయలుంటే ఈనాడు 16-20 రూపాయలుగా ఉంటున్నది.

### ప్రభుత్వాల బాధ్యత

ఏ ప్రభుత్వమైనా సమాజంలో జీవనావకాశాలు దుర్లభంగా ఉన్నవారి సంక్షేమం చూడాల్సిన

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

బాధ్యత ఉంటుంది. దీనికి రాజ్యాంగంలోనే రాసి ఉండాల్సినవసరం లేదు. సమాన అవకాశాలు లేనివారు, భూమి, నీరులాంటి సామాజిక సంపదల్లో పట్టులేనివారికి, శ్రమకు తగిన ఫలితం లేనివారికి రెండు పూటల తిండి దొరకడమే సమస్య. అటువంటి వారికి మన సమాజంలో కొదవలేదు. సమాజంలో దారిద్ర్యం పూర్తిగా తొలగిపోయేంతవరకూ ఇటువంటి సంక్షేమ పథకాలు కొనసాగాల్సిందే. ఆ దిశగా రెండు రూపాయలకు కేజీ బియ్యం పథకం, ఇందిరమ్మ ఇళ్ళు, ఆరోగ్యశ్రీ పథకాలు, ఉపాధి హామీ పథకం, పని, తిండి, నివాసం, ఆరోగ్యం లాంటి నాలుగు ప్రధాన సమస్యలకు ఈ రోజు పథకాలు అమలవుతున్నాయి. ఇది ఒక శుభపరిణామం, అయితే ఇతరత్రా ధరలు సామాన్యునికి అందుబాటులో లేకుండా పెరిగిపోతున్న పరిస్థితులలో రెండు రూపాయలకు కేజీ బియ్యం సహాయం ఏపాటిదని విమర్శిస్తున్నవారు ఉన్నారు. ఇందులో కూడా వాస్తవం ఉంది. ఈ రోజు సగటు మనిషి బతకడానికి అవసరమైన నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో లేకుండా పోయినాయి. ఈ పరిస్థితి మన దేశానికే పరిమితమైలేదు. ప్రపంచవ్యాప్తంగా దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున్న అనేక దేశాల్లో ఆహార ధాన్యాల ధరల పెరుగుదలపట్ల ఆందోళనలు చేస్తున్నారు. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. అందుకే సరి అయిన సమయంలో అవసరమైన వారికి సబ్సిడీ బియ్యం సామాన్య ప్రజానీకానికి గొప్ప ఊరట.

## ప్రజల కొనుగోలు శక్తి పెంచాలి.

మార్కెట్టులో అన్ని పారిశ్రామిక ఉత్పత్తులకు ధరలు పెరిగాయి. గత నాలుగుయిదు నెలల్లోనే 60 శాతం వరకూ ఇనుము ధరలు పెరిగాయి. మొత్తం సరుకుల రవాణాపై ప్రభావం చూపుతున్న డీజలు పెట్రోలు ధరలు ప్రతి సంవత్సరం 5-6 దఫాలుగా పెరుగుతున్నాయి. ఇవన్నీ పరిగణలోనికి తీసుకున్నప్పుడు బియ్యం ధర 1984లో 8 రూపాయలుంటే 20 సంవత్సరాలకు గానీ రెండింతలు కాలేదు. గ్లాసెడు నీళ్ళ ప్యాకెట్టు రెండు రూపాయలు. ఒక లీటరు మంచినీరు 14-15 రూపాయలుపెట్టి కొంటున్నాము. వీటిపట్ల మనం ఎప్పుడూ ఆందోళన చేయలేదు. అయితే ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిన మేరకు ధరలు పెరిగినా తప్పులేదు. ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా ఉన్న సామాన్య ప్రజానీకానికి తిండిగింజలు తక్కువ ధరలో ఉండడం అవసరం. కానీ కారుల్లో, విమానాల్లో ప్రయాణాలు చేయగలిగిన వారికి బియ్యం ధర సమస్యకాదు. అందుకే వేన్నీళ్ళకు చన్నీళ్ళు అన్నట్లుగా ఉపాధి హామీ పథకంలో సంపాదించుకున్న సొమ్ములో తక్కువ ధరకు బియ్యం దొరకడం కొంచెం ఊరట.

## పటిష్టపర్చాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ

కారణాలు ఏమైనా కావచ్చు కానీ మన రాష్ట్రంలో ఆహార ధాన్యాల పంపిణీ వ్యవస్థ అనేక సమస్యలనెదుర్కొంటోంది. ఈ దుర్గతికి కారణం రాజకీయ జోక్యం, అసమర్థ అధికార యంత్రాంగం, డీలరుకు గిట్టుబాటు విధానం. గ్రామంలో స్టోర్లు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండడం మూలంగా అనేక అవినీతి పద్ధతులు రాజ్యమేలుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు స్టోరు డీలర్లు బియ్యం స్టాకు పాయింట్ల నుంచే దారిమళ్ళిస్తున్నారు. నెలలో కేవలం రెండు మూడు రోజులు మాత్రమే స్టోర్లు తెరచి ఉంచడం మూలంగా నిత్యావసరాలు కొనడానికి డబ్బులు సమకూరక బీదలు కొనలేకపోతున్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ బలంగా ఉంది. వాటిలాగే మన రాష్ట్రంలో కూడా ప్రజా పంపిణీ వ్యవస్థను బలీయం చేయాలి. ఈనాడు ప్రతి గ్రామంలోనూ మహిళా సంఘాలు, గ్రామైక్య సంఘాలు ఉన్నాయి వారికి గిట్టుబాటు అయ్యే కమీషను పద్ధతి మీదనో, లేదా నెలసరి గౌరవ వేతనం ద్వారానో పంపిణీ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించాలి. ప్రజలకు కార్డుల ద్వారా సరఫరా చేయదగు నిత్యావసరాలకు అన్నింటికీ ముందుగానే కూపన్లు ఇవ్వాలి. నెలపొడుగునా స్టోర్లు నిర్ణీత సమయంలో తెరచిఉంచాలి. ఒక వేళ ఏదైనా కారణం వల్ల లబ్ధిదారుడు ఆ నెలలో రేషను తీసుకోలేకపోతే, మరుసటి నెలలో కూడా వాటిని తీసుకునేట్లుగా ఉండాలి. రాబోయే రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగానే ఆహారధాన్యాలకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. దానికి ప్రభుత్వాలే తలకిందులవుతాయి. అందుకే ప్రభుత్వాలు ఇటువంటి సంకట పరిస్థితులను ఎదుర్కోకుండా ఉండడానికి ప్రజా పంపిణీ వ్యవస్థను కుదుటపర్చడం చాలా అవసరం. ఈ అవసరం ప్రజలకంటే ప్రభుత్వాలకే ఎక్కువ. ఎందుకంటే ప్రభుత్వాల్ని కాపాడుకోవడం వాటికి చాలా అవసరం. ప్రజా పంపిణీ వ్యవస్థ ఎంత బలీయంగా ఉంటే ప్రభుత్వాలకు అంత తలనొప్పులు తగ్గుతాయి.

బియ్యం, గోధుమ లాంటివి దూర ప్రాంతాలలో సేకరించి వాటిని నిల్వఉంచడం, రవాణా ఖర్చుల పేరుతో కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేయడం చేస్తున్నారు. ఈ విధానం వలన రాజకీయ పలుకుబడి కలిగిన రాష్ట్రాలు, ప్రాంతాలలో ధాన్యం సేకరణ జరుగుతాయి. ఇతర ప్రాంతాల రైతులు ఈ అవకాశాన్ని కోల్పోతారు. అందుకే ధాన్యం సేకరణ ఆహారధాన్యాలు ఆ జిల్లాలోనే సేకరించి ఆ జిల్లా పరిధిలోనే గోదాముల్లో భద్రపర్చాలి. దీని వలన రవాణా ఖర్చులు తగ్గుతాయి. స్థానిక రైతుల ఉత్పత్తులు ప్రభుత్వం కొన్నట్లు అవుతుంది.

## పౌష్టికాహార భద్రత దిశగా చర్యలు అవసరం.

ఆహార భద్రతే కాదు, పౌష్టికాహార భద్రత కూడా కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. దక్షిణాది రాష్ట్రాలలో గోధుమను నిత్యావసరంగా ఉపయోగించరు. జొన్నలు, రాగులు, కందులు లాంటి ముతక ధాన్యాలను ప్రధాన ఆహారంగా వాడుతారు. శ్రమించేవారికి పౌష్టికాహార అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ దిశగా ఇక్కడి ప్రజల దైనందిక ఆహారంలో జొన్నలు, రాగులు, కందులు లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. బియ్యం కంటే వీటిలో పౌష్టికాహార విలువలు ఎక్కువగా ఉంటాయి. పౌష్టికాహారం తీసుకుంటున్నప్పుడు సాధారణంగా రోగాలు కూడా దరిచేరవు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి నెలకు అయిదు కేజీల చొప్పున కుటుంబానికి 20 కేజీలకు మించకుండా బియ్యం ఇస్తున్నారు. ఒక వ్యక్తి సంపూర్ణ ఆహారం కావడానికి ఈ బియ్యానికి అదనంగా మరో 10 కేజీల ధాన్యం ఉండాలి. ఈ లోటును భర్తీ చేయడానికి ఒక వ్యక్తికి ఇప్పుడిస్తున్న 5 కేజీలకు అదనంగా రెండు రూపాయల ధరకే 10 కేజీలు రాగులు, జొన్నలు, కందులు, సద్దలు ఇవ్వాలి. ఏ జిల్లాకు ఆ జిల్లాలో ధాన్యసేకరణ జరిపి, నిలువ ఉంచడంవల్ల ఆదా అయ్యే రవాణా ఖర్చుల్లో ఈ ధాన్యాన్ని అదనంగా ఇవ్వవచ్చును. అదే కాకుండా దొంగ రేషన్ కార్డులు వేల సంఖ్యలో డీలర్ల దగ్గర ఉన్నాయి. వీటిని రద్దు చేసినా ఈ ఖర్చు భరించవచ్చును. దీని వలన పౌష్టికాహార భద్రత ఏర్పడడమేకాకుండా, వీటిని పండించే మెట్ట ప్రాంత రైతులకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు అవుతుంది. మెట్ట రైతు నుంచి మద్దతు ధరలతో రైతుల నుంచి సేకరించాలి. బియ్యానికి, గోధుమలకు అంతర్జాతీయ మార్కెట్టు ఉన్నది. దీని ద్వారా ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉండదు. జొన్నలు, రాగులు, సద్దలకు విదేశాలలో గిరాకీ ఉండదు. ఆ రకంగా వీటి ఉత్పత్తులు ప్రజల్ని ఆదుకుంటాయి. కేవలం ఆహార భద్రత ఉంటేచాలదు. వారికి గిట్టుబాటు ధరలు లభించాలి. తిండి గింజలతోపాటు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారానే సామాన్య ప్రజానీకానికి నూనె, చక్కెర పప్పుధాన్యాలు చౌకధరలకందించాలి. ఇవి పక్కదారి పట్టకుండా తగిన జాగ్రత్తలు కూడా తీసుకున్నప్పుడే పథకం సఫలమౌతుంది.

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజీ**

# వాటర్‌షెడ్ వార్తలు

## గిరిజనుల జీవితాన్ని మార్చివేసిన చెక్‌డ్యాములు :

కనగానపల్లి మండలంలోని మద్దలచెరువు తాండాలో 47 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 50-60 సంవత్సరాల క్రితం కళ్యాణదుర్గం ప్రాంతంలోని పాలవాయి గ్రామం నుంచి రెండు కుటుంబాలు వలసవచ్చి మద్దలచెరువు గ్రామానికి దూరంగా పై భాగంలో సున్నపు బట్టీలు వేసుకుని జీవనం కొనసాగించారు. సున్నపు బట్టీలే వారి జీవనాధారం. క్రమంగా సున్నపు బట్టీలకు తోడు ప్రభుత్వ భూముల్ని సాగుచేయటం మొదలుపెట్టి వ్యవసాయాన్ని రెండవ వృత్తిగా స్వీకరించారు. కుటుంబాలు పెరిగాయి. పెద్దవయ్యాయి. ఈనాటికి 47 కుటుంబాలుగా విస్తరించాయి. సాగు చేసుకుంటున్న భూముల్లో అరకొర పంటలు మాత్రమే పండేవి. ఈ క్రమంలో ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ సంస్థ కనగానిపల్లి వాటర్‌షెడ్ భాగంగా తాండాను ఆనుకొని పోతున్న వంకమీద 7 చెక్‌డ్యాములు నిర్మించినది. అంతేకాదు, గిరిజన కుటుంబాలు వ్యవసాయదారులుగా స్థిరపడడానికి అనేక వసతులు కల్పించింది. పాఠశాల నిర్మించింది. నివాసాలు నిర్మించింది. వారిలో క్రమశిక్షణ పట్టుదల అభివృద్ధి చెందడానికి సహాయ పడింది. చెక్‌డ్యాములు నిర్మించడానికి ముందు నీటికి చాలా కటకటగా ఉండేది. ఈ రోజు తాండాలో ఎవరూ సారాయి తాగరాదు. తగాదాలు తాండా పెద్దల మధ్యనే పరిష్కరించుకోవాలి. సారాయి తాగడం మానుకున్న తర్వాత, ఇతరులు సారాయి తెచ్చి అమ్మే ప్రయత్నం చేశారు. ఎక్సైజ్ పోలీసులకు ఫోన్ చేసి పట్టిచ్చారు. అప్పటి నుండి వేరేవారు కూడా సారాయి తేవడం మానుకున్నారు. 5-6 సంవత్సరాల క్రితం కట్టిన చెక్‌డ్యాములు (20-3-2008 తేదీకి 3 రోజుల ముందు కురిసిన చిన్నపాటి వర్షానికే చెక్ డ్యాములు కళకళలాడుతూ ఉన్నాయి) నిర్మించినప్పటి నుండి చుట్టుపక్కల భూములలో భూగర్భజలాలు పెరిగాయి. ప్రభుత్వం ఒక్కోరైతుకు 5 ఎకరాలు పట్టా ఇస్తే, ఈ రోజు ప్రతి రైతూ బోర్లు వేసుకున్నారు. మామిడి, నారింజ, జామ, టెంకాయ చెట్లతోపాటు వరి, బొప్పాయి, వేరుశనగ పంటలు పండిస్తూ ఉన్నారు. ప్రతి ఒక్కరూ డ్రిప్‌లు వేసుకున్నారు. సున్నపు బట్టీలు మానివేసారు. పూర్తికాలపు రైతులుగా రూపాంతరం చెందినారు. అన్ని కుటుంబాల ఆర్థికస్థితి మెరుగుపడింది. ఈ రోజు తాండాలోని పిల్లలందరూ ప్రాథమిక స్థాయినుంచి యూనివర్సిటీ స్థాయి వరకూ చదువుకుంటున్నారు. 10 మంది పట్టభద్రులు, ఒకరు యం.బి.ఎ, ఒక టీచర్ ఉన్నారు. ప్రభుత్వం భూములయితే ఇచ్చిందిగానీ బోర్ల నుంచి, డ్రిప్పుల వరకూ, విద్య, వైద్యం సదుపాయాలతో ఆర్.డి.టి. సంస్థే అన్ని విధాల సహాయపడిందని తాండా వాసులు చెప్పారు. వారి ఆర్థిక స్థాయి మార్పుకు సహాయపడిన చెక్‌డ్యాములు వారి పాలిట కల్పతరువులుగా నిలుస్తున్నాయి.

## నీతి వాక్యం :

ఆ॥ భూమి లోన పుట్టు భూసారమెల్లను,
తనువు లోన బుట్టు తత్వమెల్ల,
శ్రమ లోన పుట్టు సర్వము తానౌను,
విశ్వదాభిరామ, వినురవేమ.

## తాత్పర్యము :

జీవాన్నిచ్చే సారమంతనూ, భూమిలోనే పుడుతుంది. తత్వ భావనలన్నీ దేహానికి సంబంధించే పుడుతాయి. సంపద అంతా శ్రమలోనే పుడుతుంది, విశ్వవ్యాపితమైతుందని వేమన చెబుతున్నారు.

## చర్చ :

వేమన పద్యాల్లో కెల్లా మకుటాయమైనట్టిది ఈ పద్యం - చాలా సులభమైన పదాలతో తక్కువ మాటలతో బ్రహ్మాండమైన అర్థాన్ని ఇచ్చినదీ పద్యం. భూమ్మీద ఉండే ప్రతి ప్రాణికి ఆహారం సమకూర్చేది భూమే. ఆఖరికి ఎంతో విజ్ఞానాన్ని సాంకేతిక నైపుణ్యాన్ని సమకూర్చుకున్నట్టి మనిషి కూడా భూమి ద్వారా లభించే పంటలనే ఆహార పదార్థాలుగా స్వీకరిస్తున్నాడు. అటువంటి భూమి సమస్త ప్రాణులకు ప్రాణాధారమైనట్టిది. ఏ సంపదనైనా సృష్టించవచ్చు. కానీ భూసంపదను సృష్టించడానికి సాధ్యం కాదు. అందుకే మానవులందరూ సుభిక్షంగా బతకాలంటే భూమి ఉపయోగంలోనికి ఉండాలి. అటువంటి భూమిని కొంతమంది కబ్జా చేయడం, భూమిని వ్యర్థ రసాయనాలతో కలుషితం చేయడం జరుగుతోంది.

తత్వమంటే జీవనసారం. అనేక కష్టాలకు, దుంఖాలకు మూలం ఆశ, అత్యాశ. దీనిలోంచి వచ్చే సుఖదుఃఖాల కారణంగానే మనిషిలో తాత్వికజ్ఞానం పెరుగుతోంది. కోరికలు అదుపులో ఉంచుకున్న వారికి రాగద్వేషాలు, అసూయలు, ద్వేషాలు బాధించవంటారు. తాత్వికత అంటే వాస్తవాలకు దగ్గరగా ఆలోచించడం. వాస్తవాలు పునాదిగా ఉంటే ఆలోచన సన్మార్గంలోకి నడిపిస్తుంది.

మూడవ విషయం శ్రమ. ప్రపంచంలో సకల పురోభివృద్ధికి శ్రమ మూలం. శ్రమలేనిదే పురోగతి లేదు. మానవ మనుగడ అసలు లేదు. శ్రమించే వారే చరిత్ర నిర్మాతలు. వారికి మాత్రమే ప్రకృతి సంపదను అనుభవించుకునే హక్కు ఉంటుంది. శ్రమ చేయనివానికి తప్పించుక తిరిగే వారికి ప్రకృతి సంపదను అనుభవించే హక్కు లేదు. శ్రమ చేయనివానికి ఈ భూమ్మీద ఎలాంటి హక్కులేదు. ఈ భూమ్మీద పెరిగే శ్రమ వ్యక్తుల నుంచీ ఉద్భవించినా, మొత్తం ప్రపంచ వ్యాపిత శ్రమలో సమ్మిళితమవౌతుంది. సంపదను సృష్టిస్తుంది. సర్వవ్యాపితమౌతుంది.

**వై.వి. మల్లారెడ్డి,** డైరెక్టరు

(వెనుక పేజీ నుండి)

### దీపపు ఎరలు :

స్థానిక పరిస్థితులను బట్టి మంటలకు బదులుగా దీపపు ఎరలను వాడి రెక్కల పురుగులను ఆకర్షించవచ్చు. పొలంలో 150 వాట్ల బల్బు వేలాడదీసి దాని కింద తొట్టిలో నీరుపోసి ఒక మూత కిరసనాయిలు (గ్యాస్‌నూనె) పోసి పెడితే రెక్కల పురుగులు ఆకర్షింపబడి తొట్టిలో పడి చనిపోతాయి. సుమారు నాలుగు ఎకరాలకు ఈ విధమైన దీపపు ఎర ఒకటి సరిపోతుంది.

ఉదా: వరిని ఆశించే కాండం తొలిచేపురుగు, దోమపోటు పురుగు, ఉల్లికోడు పురుగులు రెక్కల దశలో కాంతివంతమైన దీపాలకు ఆకర్షితమవుతాయి. అందువల్ల వరిసాగుచేసే క్షేత్రాలలో దీపపు ఎరలను వాడి ఈ పురుగులను కొంత వరకు తగ్గించవచ్చు. ఆ ప్రాంతంలోని రైతులందరూ సామూహికంగా దీపపు ఎరలు వాడినపడే మంచి ఫలితం కనిపిస్తుంది.

### లింగాకర్షక బుట్టలు :

వేరుశనగలో శనగపచ్చ పురుగు, పొగాకులద్దె పురుగు, లింగాకర్షక రసాయనాలతో కూడిన ఎరబుట్టలను పొలాలలో ఉంచి పురుగుల ఉనికిని అంచనా వేయవచ్చు. ఎకరాకు 4 లేదా 5 బుట్టలను ఉంచి పురుగుల ఉధృతిని గమనించవచ్చు. ఈ ఎరలకు మగ రెక్కల పురుగులు ఆకర్షితమై బుట్టలో పడతాయి. అప్పుడు ఆడ రెక్కల పురుగులకు సరిపడినన్ని మగ పురుగులు లేక వాటి సంయోగానికి అంతరాయం కలుగుతుంది. తద్వారా పురుగుల సంతానోత్పత్తి జరగక, వాటి సంతతి అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది.

### పసుపు పల్లెం / డబ్బా ఎరలు / పక్షి స్థావరాలు :

ఆముదం నూనె రాసిన పసుపు రంగు పల్లెం ఎరలను వాడి పత్తిలో తెల్లదోమ ఉనికిని గమనించవచ్చు.

ఆముదం లేక జిగురు పూసిన డబ్బాలు లేదా పళ్ళాన్ని పొలంలో పంట ఎత్తుకు కొంచెం పైకి ఏర్పాటుచేస్తే రంగులకి ఆకర్షింపబడే పురుగులు వాటికి అతుక్కుని చనిపోయేలా చేయవచ్చు. తెల్లని రంగు ఎరలు తామర పురుగుని ఆకర్షిస్తాయి.

# సుస్థిర వ్యవసాయంలో రైతు పాత్ర

లాభదాయకమైన దిగుబడి సాధించడానికి పురుగులను అదుపులో ఉంచడం అవసరం. దీనికోసం హానికరమైన రసాయనాలను వాడితే పర్యావరణం, మన ఆరోగ్యం దెబ్బతింటున్నాయి. వాటికి బదులుగా... పురుగులపై అవగాహన, పంటకు నష్టం కలిగించే పురుగులు, మేలుచేసే పురుగులను గురించి రైతు అవగాహన పెంచుకోవాలి. నష్టపరిచే పురుగుల జీవిత దశలలో బలహీనతలు గ్రహిస్తే అదుపు చేయడం సులభమవుతుంది.

## నియమాలు :

**సహజ ప్రక్రియలు :** ప్రకృతిలో పురుగులపై సహజంగా ఉండే అదుపును ప్రోత్సహించడం. సహజక్రియలను ప్రోత్సహించే అంతరపంటలను వేసుకోవడం, ఎరపంటలు వేయడం, పొలంచుట్టూ రక్షక పంటలు నాటుకోవడంచేయాలి. పురుగుమందులు వాడకపోవడంవల్ల మిత్రకీటకాలు వృద్ధి చెందుతాయి.

**యాజమాన్య నైపుణ్యం :** నేల, నీటివనరులు, వాతావరణాన్ని బట్టి పంట ఎంపిక, స్థానికంగా తరచుగా ఎదుర్కొనే సమస్యలను తట్టుకునే మంచి విత్తనం, చీడపీడలకు తట్టుకోలేని పంటలను, తట్టుకునే ఇతర పంటలతో పంటమార్పిడి చేయడం, విత్తే సమయాన్ని ముందూ వెనుక చేయడం ద్వారా చీడపీడల తాకిడిని తప్పించడం, పురుగు బలహీనతలను దృష్టిలో పెట్టుకొని లింగాకర్షకాలను, దీపపు ఎరలు, పక్షిస్థావరాలు, రంగుల జిగురు డబ్బాలు ఏర్పాటు.

**స్థానిక వనరులు :** మార్కెట్‌లో లభించే రసాయనాలకు బదులుగా నేలలో సారం పెంచడానికి, పురుగుల నియంత్రణకు తోడ్పడే స్థానికంగా లభించే సేంద్రియ పదార్థాలు వాడాలి. ఇవి గ్రామస్థాయిలో అందరికీ అందుబాటులో చౌకగా లభిస్తాయి.

**శ్రమ :** మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే రసాయనాల మీద ఆధారపడితే పైన చెప్పుకున్న పద్ధతులేవీ సరిగ్గా పనిచేయవు. అందువల్ల రైతు శ్రమనే పెట్టుబడిగా పెట్టి సస్యరక్షణ చేయాలి.

**సామూహిక చర్యలు :** కొన్ని పురుగులను అదుపు చేయడానికి గ్రామస్థాయిలో రైతులందరూ కలిసికట్టుగా నివారణ చర్యలు చేపట్టాలి. ఉదా॥ రసాయన పురుగు మందులను గ్రామమంతా నిషేధించడం, సామూహికంగా మంటలు వేయడం మొదలగునవి.

## యాజమాన్య పద్ధతులు

**ఎండాకాలం దుక్కులు :** ఎండాకాలంలో పొలంలో పైరు లేనప్పుడు భూమిని లోతుగా దున్నితే, భూమిలో దాక్కుని జీవించే చీడపురుగులు నశిస్తాయి.
ఉదా : వేరుశెనగలో వేరు తొలిచే పురుగు, శనగపచ్చ పురుగు యొక్క కోశస్థదశ, పొగాకు లద్దెపురుగు కోశస్థదశ, మిడతల గుడ్లు భూమిలో ఉంటాయి. పైరుసాగు చేసినప్పుడు పురుగులు వెలుపలకు వచ్చి పైర్లను నష్టపరుస్తాయి. ఎండాకాలం దుక్కులవల్ల ఇవి వేసవి ఎండ వేడిమికి మొదట్లోనే నశిస్తాయి. పక్షులు పురుగులను ఏరితింటాయి.

**పొలాన్ని శుభ్రంగా ఉంచడం:** పైరు పూర్తి కాగానే, పంట మొదళ్ళను తొలగించి పొలాన్ని శుభ్రంగా ఉంచాలి. ఆ మోళ్ళు అనేక చీడ పురుగులకు ఆశ్రయం ఇస్తాయి.
ఉదా : వంగపంటలో కాయతొలుచు పురుగును నివారించవచ్చు. ఎప్పటికప్పుడు చెత్తను తగులబెట్టి నాశనం చేస్తే కొద్ది సంవత్సరాలలోనే పురుగు ఉధృతి తగ్గడాన్ని గమనించవచ్చు.

**పంట మార్పిడి :** వండ, కొమ్మ, కాయ తొలచు పురుగు వంటి కొన్ని ఏకపంట పురుగులను అదుపు చేయడానికి ఇది ముఖ్యమైన పద్ధతి. సంవత్సరాల తరబడి ఒకే పొలంలో, ఒకే పైరు సాగుచేసినప్పుడు ఆ పైరును ఆశించే పురుగులు నిరంతరం వృద్ధి చెందుతాయి. అందువలన పంట మార్పిడిని అనుసరిస్తే చీడ పురుగుల ఉధృతి తగ్గుతుంది. (పంట మార్పిడివలన భూసారాన్ని కూడా కాపాడవచ్చు)

**ఎరపైరు / రక్షణ పైరు :** చీడ పురుగులు కొన్ని పైర్లకు ఎక్కువగా ఆకర్షితమవుతాయి. అలాంటి పైర్లను చేల చుట్టూ నాటితే పొలంలో పంటపై చీడ పురుగుల ఒత్తిడి తగ్గుతుంది.
ఉదా : రెక్కల పురుగు దశలో పొగాకు లద్దెపురుగులు వేరుశనగకంటే ఆముదాలకు బాగా ఆకర్షితమవుతాయి. అందువలన వేరుశనగ పొలం చుట్టూ ఆముదాలను ఒకటి, రెండు సాళ్లు వేస్తే ఆముదాల మీదనే గుడ్లు పెడతాయి. అప్పుడు వేరుశనగకు పురుగు ఒత్తిడి తగ్గుతుంది. ఆముదం మీద పురుగులను సులువుగా ఏరి నాశనం చేయవచ్చు. పత్తికి ఆముదం రక్షణ పైరుగా పనిచేస్తుంది.

**అంతర పంట :** అంతరపంటలు వేసుకోవడం వలన మెట్ట వ్యవసాయంలో కరువు పరిస్థితుల్లో లాభదాయకతను పెంచుకోవచ్చు. పత్తిలో మినుము, పెసర లేదా అలచందలు, పొద్దుతిరుగుడులో వేరుశనగ అంతర పంటగా వేసుకుంటే అక్షింతల పురుగులు వృద్ధి చెంది సహజ సస్యరక్షణ జరుగుతుంది. భూసారం పెరుగుతుంది.

**నాణ్యమైన విత్తనాలు, నారునాటడం :** చీడ పురుగులు, తెగుళ్ళు ఆశించని విత్తనాలను మాత్రమే ఉపయోగించాలి.
ఉదా: నులిపురుగులు ఆశించిరన టమాటో, వంగనారుగాని, పొలుసు పురుగు ఆశించిన చెరకు ముచ్చెలనుగాని నాటడానికి ఉపయోగించరాదు.

**పంట విత్తే కాలాన్ని సరిచేయడం :** గత సంవత్సరాల అనుభావాలను బట్టి పంటను ఆశించే పురుగుల ఉధృతి ఏ సమయంలో ఎక్కువగా ఉంటుందో గమనించి విత్తే కాలాన్ని సరిచేయడం ద్వారా పంటను పురుగుల నుంచి రక్షించవచ్చును.

## తేమ మరియు భూసార యాజమాన్యం

పంటకు ఎక్కువగా నీరూ, రసాయన ఎరువులు వాడటం వల్ల చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయి. మొక్కలకు నీరు అవసరం లేదు. తగినంత తేమ కావాలి. తేమను పట్టి ఉంచి, వేర్లకు ఎక్కువ కాలం అందించేందుకు సేంద్రియ పదార్థం ఎంతో అవసరం.
పంటకు సుమారు 16 పోషకాలు అవసరం. రసాయన ఎరువుల్లో లభించే ఒకటి లేదా కొన్ని పోషకాలు మొక్కకు సమతుల పోషకాలు అందించలేవు. అందువల్ల మొక్కలో పురుగులను, తెగుళ్లను ఎదుర్కొనే శక్తి ఉండదు. సేంద్రియ పదార్థాలలో అన్ని పోషకాలతోపాటు పురుగులకు, తెగుళ్లకు తట్టుకునే శక్తి వస్తుంది. పోషకాల కోసం, తేమను పట్టి ఉంచే శక్తికోసం సేంద్రియ ఎరువులపై ఆధారపడాలి.
పంటకు తడి ఎక్కువగా ఇవ్వడం వలన పంటలో తెల్లదోమ, వరిలో సుడిదోమ మొదలగు రసం పీల్చు పురుగుల ఉధృతి పెరుగుతుంది.

**మంటలు :** పొలంలో సామూహికంగా మంటలు వేసి రెక్కల పురుగులను ఆకర్షించి నాశనం చేయవచ్చు.
ఉదా: వేరుశనగ పైరును నష్టపరిచే ఎర్రగొంగళిపురుగు, అనేక ఇతర రెక్కల పురుగులు మంటలకు ఆకర్షితమవుతాయి. అందువలన ఎండిన మోళ్లు, చెత్తా చెదారం ఉపయోగించి వేరుశనగ పొలంగట్లపై రాత్రుల్లో మంటలు పెడితే రెక్కల పురుగులు ఆకర్షితమై మంటలలో పడి చనిపోతాయి.

(మిగతా వెనుక పేజీలో)

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in